# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రకృతి విపత్తుల నుంచి సంభవించే ప్రమాదాలను తగ్గించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు.

2. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ 'ప్రజలే నా ఆత్మకథ'ను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హైదరాబాద్‌లో ఈరోజు ఆవిష్కరించారు.

3. యోగాంధ్ర-2025లో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

4. తుఫానులు, వరదలు వంటి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధమై ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ అధికారులను ఆదేశించారు.

==========================

ప్రకృతి విపత్తుల నుంచి సంభవించే ప్రమాదాలను తగ్గించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాల నిర్మాణంపై 2025 సంవత్సరానికి ఫ్రాన్స్‌లో నిర్వహిస్తున్న సభను ఉద్దేశించి నిన్న ఆయన దృశ్య మాధ్యమ విధానంలో ప్రసంగించారు. విపత్తులను తట్టుకోగలిగే మౌలిక వసతులను నిర్మించాలంటే.. నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేసుకోవడం, విపత్తులను సమర్థంగా ఎదుర్కొన్న అనుభవాలను వివరించే పత్రాలతో అంతర్జాతీయ డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు, విపత్తుల రాకను ముందుగానే హెచ్చరించే వ్యవస్థల నిర్మాణం, విపత్తుల నియంత్రణకు నిధులు సమకూర్చడం, అంతర్జాతీయ సమన్వయ సహకారాలు అవసరమని ప్రధానమంత్రి వివరించారు.

---------------------------

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ 'ప్రజలే నా ఆత్మకథ'ను హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం పుస్తక ప్రతులను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు అందజేశారు. దత్తాత్రేయ తన 70 ఏళ్ల జీవిత పార్శ్వాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, ఎస్.అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు.

---------------------------

రాష్ట్రంలో నైరుతి రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు, వరదలు వంటి ఎటువంటి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సర్వ సన్నద్ధమై ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రుతుపవన సన్నద్ధతపై సచివాలయం నుంచి నిన్న ఆయన వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్సు, కోస్టు గార్డు,ఎన్డీఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. ఎక్కడైనా అధికవర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగి వరదలు వచ్చే పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలని, సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, తదితర శాఖల అధికారులను ఆదేశించారు.

--------------------------

భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ఎన్టీఆర్ జిల్లాలో రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, పురపాలక, వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాలు జారీచేశారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 9154 970 454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశామని.. ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఈ నంబరులో సంప్రదించి, సమాచారమివ్వాలని శనివారం ఆయన సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, సరఫరాలో ఆటంకం లేకుండా పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, నిరంతరం పరిస్థితిని సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

--------------------------

గత దశాబ్ద కాలంలో భారత్ అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించింది. సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం అనే అంశాల ఆధారంగా గత 11 సంవత్సరాలలో కీలక రంగాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా మధ్యతరగతి ప్రజలు సాధికారత సాధించేందుకు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల గురించి ఈరోజు తెలుసుకుందాం.

...వాయిస్ 38 సెకన్లు

--------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర 2025 మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు అనంతపురం శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలియజేస్తూ..

..వాయిస్..33 సెకన్లు

--------------------------

విశాఖపట్నం పోర్టు స్టేడియంలో ఈ రోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

వయో వృద్ధులు, యూసిడీ సభ్యులు, యోగా సంఘం ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు, నగర ప్రజలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల యోగాసనాలు సాధన చేశారు.

---------------------------

యోగా సాధనతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, దీనిని మన జీవితంలో భాగం చేసుకోవాలని ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో కొత్తపట్నం బీచ్‌లో దాదాపు 1500 మంది ఈ రోజు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ.. యోగా మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనటానికి జిల్లా నుంచి ఇప్పటివరకు 9లక్షల 66 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని జాయింట్ కలెక్టర్ వివరిస్తూ...

...వాయిస్..34 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు కొద్ది సేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.నందన్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు నెల్లూరులో వయో వృద్ధుల కోసం నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్వీకులు..మనకు అందించిన యోగాను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత మనపై ఉందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. వాటిలో పాల్గొనాలని ఆయన కోరారు.

======================